కవిచక్రవర్తి

1

ఆనాటి అర్ధరాత్రి వేళ ఉజ్జయినీ నగరం అంతా శిశిరర్తు హిమవర్షంలో లేత లేత వెన్నెల వెలుగులలో తెల్లని దుప్పటి కప్పుకొన్నట్లు తళ తళ మెరిసింది. రాజప్రాసాదంలో హర్ష విక్రమాదిత్య చక్రవర్తి హంసతూలికా తల్పంపై నిద్రిస్తున్నాడు. అలా కొంతకాలం గడిచేసరికి జివ్వుమనే చలిగాలి గవాక్షాల తెరలు తొలగించుకొని రివ్వుమని లోపల ప్రవేశించింది. ఆ చలిగాలికి చక్రవర్తికి మెలకువ వచ్చింది. శయనాగారంలో హసంతికలు జాజ్వల్యమానంగా వెలిగిపోతున్నాయి. కాని దీపాల కాంతులు కొంచెం మందగించాయి. నూనెపోసి ప్రజ్వలింపజేసే పరిచారకులు పార్శ్వభవనాలలో గాఢంగా నిద్రపోతున్నారేమో అనుకొన్నాడు చక్రవర్తి. లేకపోతే ఆ దీపికలలా ఎందుకు సన్నగిలిపోతున్నాయి ? ఆ సమీపంలో ఎక్కడా ఆ పరిచారకుల అలికిడే వినిపించలేదు.

"ఎవరక్కడ?" అని పిలిచాడు హర్షచక్రవర్తి. వెంటనే ఒక వ్యక్తి శయ్యాగారంలో ప్రవేశించి దీపికల ప్రమిదలలో నూనెపోసి తిరిగీ ప్రజ్వలింప జేశాడు. మళ్ళీ అవి జాజ్వల్యమానంగా వెలిగాయి. చక్రవర్తికి లోపలికి వచ్చిన వ్యక్తి సామాన్య పరిచారకుడులా కనిపించలేదు.

"ఎవరా వచ్చినది?" అని ప్రశ్నించాడు.

"మహాప్రభూ! నేను! మాతృగుప్తుణ్ణి!" అన్నాడా నూతనవ్యక్తి.

"మాతృగుప్త కవీశ్వరులా?" అని చక్రవర్తి లోలోపల కొంచెం ఆశ్చర్యపోయాడు! ఆకాశంలో తారకలు దట్టంగా కమ్ముకొన్న మంచు తెరలు తొలగించుకొని లేత లేత వెన్నెలలో సన్న సన్నని చిరునవ్వులు చిలకరించాయి.

చక్రవర్తి ఒక్క నిట్టూర్పు విడిచి—

"ఇప్పటికి ఎంత రాత్రి గడిచింది?" అని ప్రశ్నించాడు.

"రాత్రి చాలావరకు గడిచిపోయింది. ఇక మిగిలింది సరిగ్గా జామున్నరయామ్రాత్రమే" అని సమాధానం ఇచ్చాడు మాతృగుప్తకవి.

చక్రవర్తి ఆ దీపకాంతిలో కవి ధరించిన దుస్తులు జాగ్రత్తగా పరకాయించి చూచాడు. అతడు ధరించినవన్నీ జీర్ణ మలిన వసనాలే!

"ఎముకలు కొరికే చలిలో ఎలాంటి చింకిపాతలు కట్టుకున్నాడో!" అనుకున్నాడు హర్ష విక్రమాదిత్యుడు. కాని ఆభావమేమీ ముఖంమీద కనబడనీయలేదు. చక్రవర్తి ఏదో ప్రశ్నించే ధోరణిలో ఉన్నాడని గ్రహించి మాతృగుప్తుడు అతని శయ్యకు దగ్గరగా నిలుచున్నాడు. చక్రవర్తి ప్రశ్నించాడు:

"ఇంత రాత్రివేళ మీ కింత స్పష్టంగా కాలమానం ఎలా తెలిసింది?"

మాతృగుప్తుని కాక్షణంలో చక్రవర్తి కవితాభిమానం స్ఫురణకు వచ్చింది. ఒక క్షణంనే పుండి అతడడిగిన ప్రశ్నకు సమాధానంగా ఒక శ్లోకం చదివాడు.

చలి ఎముకలు కొరికివేస్తున్నదనీ, అదే పనిగా హసంతిక లూదడం వల్ల పెదవులు బెరడుకట్టుకుపోయాయనీ, ఆకలి మూలాన గొంతెండిపోయినదనీ, అయా కారణాలవల్ల నిద్రాదేవత అవమానితయైన ప్రియురాలివలె దూరదూరంగా తొలిగిపోయినదనీ, సత్పాత్రదత్తమైన వసుధవలె రాత్రి ఎంతసేపటికీ గడవడం లేదనీ ఆ శ్లోక తాత్పర్యం.

ఆ విధంగా నిద్రపట్టకపోవడం వల్లనే అంత విస్పష్టంగా కాలమానం తెలుసుకోవడం జరిగినదని మాతృగుప్తుడా శ్లోకం ద్వారా చక్రవర్తికి ధ్వనింపజేశాడు.

హర్ష విక్రమాదిత్య చక్రవర్తి ఎంతో శ్రద్ధగా ఆ శ్లోకం విని ఒక్క చిరునవ్వు నవ్వి మళ్ళీ హాయిగా కళ్ళు మూసుకొని నిద్రపోయాడు.

మాతృగుప్తుడు చిరిగిపోయిన ఉత్తరీయంతో ఒళ్ళంతా కప్పుకుని చలిలో గజగజ వణికిపోతూ ఆ శయ్యాగృహం ద్వారం దాటి ఇవతలికి వచ్చివేశాడు. అక్కడే వట్టి కటికి నేలమీద చదికిలపడి ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టాడు. తన దుర్దశ తలుచుకుంటూంటే అతని కళ్ళంట కవోష్ణబాష్పా లవిరళధారగా ప్రవహించాయి.

మాతృగుప్తకవి ఉజ్జయినికి వచ్చిన తరువాత అప్పుడే ఒక సంవత్సరం గడిచిపోయింది. హర్ష విక్రమాదిత్యుడు ఆ కాలంలో భారతవర్షాని కంతటికీ చక్రవర్తి. అంతటి మహాచక్రవర్తి ఆస్థానంలో ప్రవేశం లభించినా మాతృగుప్తకవికి దారిద్ర్యపీడ తొలగలేదు. అది నానాటికీ శ్రుతిమించి పోయింది. అతనికి అప్పుడే నలభైఏళ్ళు నిండాయి. ఇంతకు పూర్వం అతడు ఎన్నెన్నో రాజాస్థానాలు సందర్శించాడు. ఎన్నెన్నో రాజసభలలో తన కవితాచాతుర్యం ప్రదర్శించాడు. ఇక దేశసంచారం విరమించుకొని మిగిలిన జీవితం అంతా ఒకే ఒక ఆస్థానంలో గడిపి వెయ్యాలని నిశ్చయించుకొన్నాడు. వెంటనే సకుటుంబంగా ఉజ్జయిని నగరం చేరుకొన్నాడు.

అదృష్టవశాత్తూ త్వరలోనే అతనికి చక్రవర్తి ఆస్థానంలో ప్రవేశం లభించింది. మొదటలో చక్రవర్తికి మాతృగుప్తకవియెడల కొంతవరకు గౌరవాదరా లేర్పడ్డాయి. తరవాత కొంతకాలానికి ఆ గౌరవాదరాలన్నీ నశించిపోయి కేవలం తటస్థదృష్టిమాత్రమే మిగిలింది. ఇటీవల కొంచెం అనాదరణకూడా ప్రారంభమైనది.

మాతృగుప్తుని అనంతరం విక్రమాదిత్యుని ఆస్థానం సందర్శించిన విద్వాంసులకు, కవీశ్వరులకు చక్రవర్తి ఎన్నెన్నో సత్కారాలు చేశాడు. మొదటగాని, అటుపిమ్మటగాని మాతృగుప్తుని కటువంటి

సత్కారం ఎన్నడూ జరగలేదు. మొట్టమొదట ఏదో కొంచెం గౌరవ భావం ఉండేది. ఇప్పుడదికూడా పూర్తిగా నశించిపోయింది. ఈ దురదృష్టపరిణతికి కారణమేమో మాతృగుప్తుని కవగాహన కాలేదు. పోనీ, చక్రవర్తి కఠిన హృదయుడేమో అనుకుంటే అదీ నిజంకాదు. అనేకానేక విద్వాంసులు, కవీశ్వరులు చక్రవర్తి ఆదర కటాక్షానికి పాత్రులై ఎన్నోవిధాల వైభవైశ్వర్యాలతో తులతూగుతున్నారు. మాతృగుప్తకవి అంటే సాటి విద్వాంసులు, కవీశ్వరులు ఎంతో ఆప్యాయంగా ఆదరించేవారు. కాని ఒక్క చక్రవర్తికే అతని యెడల కర్కశమైన కాఠిన్యభావం ఏర్పడింది.

చక్రవర్తి అంతటితో ఆగలేదు. సామాన్య పరిచారకులు నిర్వహింప వలసిన పనులు కూడా మాతృగుప్తునికే అప్పజెప్పేవాడు. చిట్ట చివరికి చక్రవర్తి శయ్యాగారంలో దీపికలు, హసంతికలు ప్రజ్వలింప జేసే నీచదాస్యంకూడా మాతృగుప్తకవిమీదే పడింది. అయినా అతడేమీ చలించక తన కప్పజెప్పినది ఎలాంటి చిన్నపని అయినా ఎంతో జాగ్రత్తగా నిర్వహిస్తూండేవాడు. అది చక్రవర్తి దాసదాసీజనం చెయ్యవలసిన పని. అయినా మాతృగుప్తుడు తన కది ఒక తలవంపుగా భావించలేదు. మిగిలిన విద్వాంసులు, కవులు చక్రవర్తి మాతృగుప్తుని యెడల వహించే కాఠిన్యానికెంతో కుంగిపోయేవారు. కాని దానికి హేతువేమో ఎవ్వరికీ అంతు చిక్కలేదు.

ఇక మాతృగుప్తుని కుటుంబ పరిస్థితులు కూడా నానాటికీ అధ్వాన్నమయిపోయాయి. ఆరు మాసాలకు పూర్వం అతని ఏకైక పుత్రుడు రోగంతో తీసుకుని తీసుకుని చిక్కి శల్యమైపోయి హఠాత్తుగా చనిపోయాడు. ఆ విచారంతో అతని గృహిణి సర్వమంగళకు కూడా ఏవో దీర్ఘరోగ చిహ్నాలు ప్రారంభమైనాయి. ఆమె పరిస్థితి కూడా నానాటికీ తీసికట్టుగానే ఉంది. అయినా మాతృగుప్తుడు చక్రవర్తి సేవలో ఏమరలేదు.

అతడా చలిలో ఏవేవో ఆలోచనా పరంపరలలో మునిగి తేలుతూంటే తిరిగి రివ్వున చలిగాలి వీచింది. కవి చిరుగుల ఉత్తరీయం మళ్ళీ గట్టిగా కప్పుకున్నాడు. ఆ ప్రయత్నంలో అది మరింత చిరిగింది.

అతడొక్క నిట్టూర్పు విడిచి ఆ లేతవెన్నెలలో తారకావగుంఠనంతో సాగిపోయే విభావరి కేసి తిలకించాడు. ఆ రజని అతని భావనా నేత్రాల కొక రమణీయాభిసారికగా భాసించింది. ఆ భావనతో అతని హృదయంలో కవితావాహిని పొంగి పరవళ్ళు తొక్కింది.

2

అలా మరికొంతకాలం గడిచిపోయింది. హర్షవిక్రమాదిత్య చక్రవర్తి తన రహస్యభవనంలో మహామాత్యునితో కలిసి రాజ్యవ్యవహారాల మంతనాలలో మునిగిపోయాడు. అది కాశ్మీరరాజ్య వ్యవహారం. ఆ కాలంలో అది హర్ష చక్రవర్తికి లోబడిన సామంతరాజ్యం. అయినా చాలావరకది సర్వస్వతంత్ర రాజ్యమే. అందువల్లనే ఆ కాలంలో కాశ్మీరరాజన్యులు చక్రవర్తి బిరుదు వహించేవారు. ఆ రోజుల్లో హిరణ్యుడనే రాజా రాజ్యం పరిపాలిస్తూండేవాడు. అతని సోదరుడు తోరమాణునికీ, అతనికీ చుక్కెదురు! అందువల్ల హిరణ్యుడు తోరమాణునికి ఆజన్మ కారాగార శిక్ష విధించాడు. చిరకాలంగా అతడా కారాగారంలోనే కృశించి కృశించి చివరికొకనాడా దుఃఖంతోనే కాలధర్మం చేశాడు. అతని రాణి ఏకైక పుత్రుడు ప్రవరసేనుడు ఆ దుఃఖాఘాతం భరించలేక తీర్థయాత్రకై వారణాశికి వెళ్ళిపోయాడు. అటుపిమ్మట కొన్ని సంవత్సరాలకు హిరణ్యుడు కూడా క్రమక్రమంగా రోగగ్రస్తుడై స్వర్గస్థుడయినాడు. ఆ పరిస్థితులలో కాశ్మీర మహామాత్యుడే రాజ్యాధికారం చేపట్టి రాజ్యపరిపాలన సాగించవలసిన అవాంతరం ఏర్పడింది. అలా కొన్ని నెలలు గడిచినా కాశ్మీర రాజ్యం ఉత్తరాధికారి ప్రవరసేనుడింకా శ్రీనగరం చేరుకోలేదు. అంతలో అతని జ్ఞాతులు యశోవర్మ, విక్రమవర్మ ఆ రాజ్యాధికారం ఆపద్ధర్మ దృష్ట్యా తమ ఒక్కరికే సంక్రమించవలెననీ, ఆ విధంగా ధర్మనిర్ణయం చెయ్యవలసిందనీ ప్రార్థిస్తూ హర్షవిక్రమాదిత్య చక్రవర్తికి వేరువేరుగా విజ్ఞప్తులు పంపించుకొన్నారు. ఆ ధర్మనిర్ణయమే చక్రవర్తి కొక విషమ పరీక్షగా పరిణమించింది. కొంత గాఢంగా ఆమథనపడిన తరువాత చక్రవర్తి మహామాత్యునితో ఇలా అన్నాడు:

"న్యాయంగా కాశ్మీర రాజ్యానికి ఉత్తరాధికారి ప్రవరసేనుడు. ఆయనకీ రాజ్యాధికారం విషయంలో ఇంతటి ఉపేక్ష ఏల?"

"అధికార విషయంలో ఆయనకంతటి ఉపేక్షాభావమేమీ లేదు. కాని జనకులు తోరమాణులా విధంగా దుర్మరణం చెందడంతో సంసారంమీద విరక్తిచెంది తీర్థయాత్రకు వెళ్ళిపోయారు." అన్నాడు మహామాత్యుడు.

"ఇంతవరకూ శ్రీనగరానికి తిరిగి రాకపోవడానికి కారణం?"

"అదే నాకవగాహన కావడంలేదు. ఎప్పటికి తిరిగివచ్చేదీ కూడా నిశ్చయంగా తెలియదు."

చక్రవర్తి తిరిగి కొంత గాఢంగా ఆలోచించి —

"మరి యశోవర్మ విక్రమవర్మల అర్హతానర్హతలెట్టివి?" అన్నాడు.

"ప్రవరసేనుల తరువాత కాశ్మీర రాజ్యానికిక ఉత్తరాధికారులు వారే."

"ఇద్దరు ఎలా కాగలరు?"

"ఇద్దరూ సమాన దాయాదులే."

"మరి వారి ప్రత్యేక సామర్థ్యాలెట్టివి?"

"నా దృష్టికి యశోవర్మే సర్వవిధాలా సమర్థులని అనిపించింది."

చక్రవర్తికీ నిర్ణయం రుచించలేదు. 'కొంతవరకు విక్రమవర్మే సమర్థుడేమో' అని సూచించాడు. మహామాత్యుడు దానికేమీ సమాధానం చెప్పక కొంతసే పూరుకుని, నెమ్మదిగా —

"చిత్తం! అలాగే నిర్ణయింపవచ్చును" అన్నాడు. అంతేగాని ఆ నిర్ణయానికి అవుననిగాని, కాదనిగాని నిష్కర్షగా సమాధానం చెప్పలేదు.

దానిమీద చక్రవర్తి నాలుగైదు నిమిషాలవరకూ ఏమీ అనలేదు. మహామాత్యుడు చక్రవర్తి ముఖభంగిమ పరీక్షిస్తూ—

"త్వరగా ఏదో ఒక నిర్ణయం చెయ్యకపోతే కాశ్మీరంలో కల్లోలం సంభవించవచ్చును!" అన్నాడు.

చక్రవర్తి దానికేమీ సమాధానం చెప్పలేదు. అలాగే ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తూ పరిసరోద్యానం వైపు దృష్టి ప్రసరింపజేశాడు. ఆ ఉద్యానవనంలో అక్కడక్కడ వసంతర్తు సౌందర్య సూచనలు కొన్ని స్ఫురించాయి. ఎక్కడో మూల మూలల దాగిన ఒక కోకిల వచ్చీరానట్టుగా పంచమస్వరం ఆలాపించింది. అది వినగానే చక్రవర్తి ముఖం ఒక్కసారిగా వికసించింది. ఆ ముఖంలో డోలాందోళన భావం అంతా ఒక్కసారిగా అదృశ్యమైపోయింది. నెమ్మదిగా అడుగులు వేస్తూ అంతఃపురం వైపు వెళ్ళిపోయాడు.

3

మాతృగుప్తుని గృహిణి సర్వమంగళ రుగ్మత ఆరోజు కారోజుకు బాగా చెయ్యి దాటిపోయింది. మాతృగుప్తు డామె కనేకవిధాల చికిత్స చేయించగా చేయించగా కొంతవరకు ప్రాణభయం తప్పినదని అనిపించింది. అలాంటి విషమఘట్టాలలో కూడా అతడు తన సేవావిధులన్నీ నిర్వర్తిస్తూనే ఉన్నాడు. అయినా చక్రవర్తి కతని విషయంలో ఏర్పడిన అనాదరణలో మార్పేమీ గోచరించలేదు.

ఒకనాడతడు ఉదయమే నిద్రలేచి కవితా వ్యాసంగంలో ఉండగా చక్రవర్తి కంచుకి అతని కెదురుగా ప్రత్యక్షమైనాడు. వెంటనే నిలుచున్నపాటుగా చక్రవర్తి సన్నిధికి రావలసిందని సవినయంగా విన్నవించాడు. మాతృగుప్తుడు తొందర తొందరగా తాతల కాలంనాటి కాశ్మీరశాలువ పైన కప్పుకుని కంచుకితో కలిసి చక్రవర్తి సన్నిధికి వెళ్ళిపోయాడు.

చక్రవర్తి తన రహస్య భవనంలో సింహాసనంమీద కూర్చుని దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు. కొంతసేపటివరకూ హర్ష విక్రమాదిత్యుడు కవి రాకకూడా గమనించలేదు. కవి అలాగే నిలబడి ఉన్నాడు. చక్రవర్తి ఉపేక్షాదృష్టితో అతని ముఖభంగిమ గమనించి, నెమ్మదిగా ఇలా అడిగాడు :

"మీ రెప్పుడైనా కాశ్మీరం సందర్శించారా ?"

"చిన్నతనంలో మా నాయనగారితో కలిసి ఒకసారి కాశ్మీ రాస్థానం సందర్శించాను."

"అయితే కాశ్మీరం మీకు సుపరిచితమే నన్నమాట!"

"చక్రవర్తీ! అది సాక్షాత్తూ భూతల స్వర్గమే!" అన్నాడు కవి.

"నేనొక అత్యంత ముఖ్యమైన దౌత్యవ్యవహారంలో మిమ్మల్ని నియోగిస్తున్నాను."

'ఈ దౌత్య వ్యవహార మేమై ఉండునా' అని కవి లోలోపల మథనపడ్డాడు.

"ఒక లేఖ మీ చేతి కందిస్తున్నాను. అది అత్యంత భద్రంగా తీసుకుపోయి కాశ్మీర మహామాత్యుల కందించాలి."

కవి అలాగే అత్యంత శ్రద్ధాభక్తులతో అతని మాటలు వింటున్నాడు.

"ఆ లేఖావ్యవహారం అత్యంత రహస్యం!" అన్నాడు చక్రవర్తి.

కవి నిర్ఘాంతపోయాడు.

"లేఖా రహస్య భంగానికి శిరశ్ఛేదమే శిక్ష!" అని ముగించాడు చక్రవర్తి.

మాతృగుప్తుడింకా ఆ ఆఘాతంలోనుంచి కోలుకోలేదు. కొంత సేపటివరకూ అలాగే మాట్లాడకూరుకుని తలవంచుకొని అతివినయంగా—

"చిత్తం! అలాగే! అయితే తమకింకా నామీద విశ్వాసం కలగ లేదే అని కించపడుతున్నాను." అన్నాడు.

"విశ్వాసం కుదరకపోతే మిమ్మల్ని దౌత్యంలో నియోగించి ఉండనుగదా! లేఖాప్రాముఖ్యం తెలుపుడు చెయ్యడానికే నేనింతగా నొక్కి నొక్కి వక్కాణిస్తున్నాను. తక్షణం మీరు కాశ్మీరం వెళ్ళి పోవాలి!" అన్నాడు చక్రవర్తి.

"తమ ఆజ్ఞప్రకారం నేనీసాయంకాలమే కాశ్మీరానికి బయలుదేరి పోతున్నాను" అన్నాడు మాతృగుప్తుడు. వెనువెంటనే చక్రవర్తి దగ్గర సెలవుతీసుకుని స్వగృహానికి మరలిపోయాడు.

మార్గంలో అతని హృదయంలో ఎన్నెన్నో ఆలోచనావల్లికలల్లుకుపోయాయి. "చక్రవర్తి కీ దౌత్యం నిర్వహించడాని కిక తగిన అధికారు లెవరును లభించ నేలేదా? ఇంతటి సామాన్య దౌత్యకృత్యానికి నేను తప్ప మరెవరూ దొరక నేలేదా?" అని ఎన్నెన్నో విధాల మథన పడ్డాడు మాతృగుప్తుడు. అతని గృహిణి సర్వమంగళ ఆరోగ్యం ఇంకా కోలుకో నేలేదు. ఆమె అతని దృష్టికి చిక్కి శల్యమైపోయిన చంద్రరేఖలా స్ఫురించింది. కవి నెమ్మదిగా ఆమెకు తన కాశ్మీర ప్రయాణ విషయం తెలియజేశాడు. ఎంతోకాలంనించి కాశ్మీరం చూడాలని ఉన్నదనీ, తానుకూడా వెంటవస్తాననీ ఆమె పట్టుపట్టింది.

"ఇంతటి నీరసస్థితిలో నీ వెలా రాగలవు సర్వమంగళా!" అన్నాడు మాతృగుప్తుడు.

"ఎప్పుడూ మీ రింతే! నన్నెప్పుడూ వెంటతీసుకుని వెళ్ళనే వెళ్ళరు!" అన్నది సర్వమంగళ. తరువాత బుడిబుడి దీర్ఘాలు ప్రారంభించింది.

అంతటి అనారోగ్యస్థితిలో ఆమెను విడిచిపెట్టి కాశ్మీరం వెళ్ళడం అతని కిష్టం లేదు. అయినా వెళ్ళక తప్పదు!

"మళ్ళీ ఒక మాసంలోపుగానే తిరిగి వచ్చేస్తాను. అప్పుడు తిరిగి మనమిద్దరము కాశ్మీరం వెడదాము" అని అత డామె నోదార్చాడు.

"మీరు మళ్ళీ వచ్చేసరికి నేను బ్రతికి ఉంటేగా!" అని ఆమె అతనికేసి జాలిగా చూసింది. వెంటనే ఆమె కళ్ళల్లో కన్నీరు మున్నీరుగా ప్రవహించింది. ఆమాట అతనికి శుభసూచనగా స్ఫురించలేదు. అయినా, ఎంతో ఆప్యాయంగా ఆమెనోదార్చి, చికిత్సకు, గృహనిర్వహణకు తగిన సౌకర్యా లేర్పాటుచేసి మాతృగుప్తుడు కాశ్మీరానికి ప్రయాణమైనాడు.

అతడు కనిపించినంతవరకు ఆమె అలాగే నిశ్చలంగా అతనికేసి చూసింది. ఆ కనుచూపులోనే ఆమె ప్రాణాలన్నీ నిలబడ్డాయి. ఆ దృష్టి కవి హృదయాన్ని చీల్చివేసింది! మాతృగుప్తుడు జీవచ్ఛవంలా అడుగులు వేసుకుంటూ అక్కడినుంచి కదిలి వెళ్ళిపోయాడు. కాశ్మీరానికి అతి త్వరితంగా వెళ్ళిపోవడానికి వీలుగా అతనికి గజాశ్వాందోళికాది వాహనా లెన్నో ఏర్పాటు చేశారు. చక్రవర్తి తలుచుకున్నప్పుడిలాంటి వాటి కేమికొదవ! కాని అతని ప్రయాణ సన్నాహం తిలకించిన ఉజ్జయినీ నగర పౌరులందరు "చక్రవర్తి ఎంతటి కఠినాత్ముడు! సామాన్య రాజ్యాధికారులు నిర్వహించవలసిన దౌత్య వ్యవహార మేదో కవీశ్వరుని నెత్తిమీద పడవేయడం ఏమిన్యాయం! ఏమైనా మాతృగుప్తుడు చాలా దురదృష్టవంతుడు!" అని తలకొకవిధంగా చక్రవర్తిని నిందించారు. మాతృగుప్తుడా అవమాన భారంతోనూ, గృహిణీ చింతతోనూ కుంగిపోతూ క్రమక్రమంగా కొంత కాలానికి కాశ్మీరదేశం చేరుకొన్నాడు.

4

కాశ్మీర సౌందర్యం తిలకించేసరికి మాతృగుప్తుని ప్రయాణఖేదం చాలావరకు సన్నగిల్లి పోయింది. నిర్మల స్వచ్ఛ జలాలతో కలకలలాడే సరోవరాలూ, దూర దూరంగా స్ఫురించే ధవళ హిమవన్నగ శిఖరాలూ సందర్శించేసరికి అతని హృదయం నిశ్చలమానస సరోవరంలా కలకదేరింది. దానిలో సర్వమంగళ సువర్ణ విగ్రహచ్ఛాయ చూచాయగా ప్రతిఫలించినట్లయింది.

శ్రీనగరం చేరుకోవాలంటే అత డింకా చాలాదూరం ప్రయాణం చెయ్యాలి. అలాగలాగ కొంతదూరం సాగిపోగా తలవని తలంపుగా అతనికొక అదృష్టం కలిసివచ్చింది. కాశ్మీర మహామాత్యుడు అనతి దూరంలో ఒక సమీపనగరంలోనే ఉన్నాడనీ, రాజ్యవ్యవహార పర్యవేక్షణ నిమిత్తం అక్కడికి వచ్చాడనీ తెలిసింది. మాతృగుప్తుడు శ్రీనగర ప్రయాణం మానివేసి తిన్నగా ఆ సమీపనగరానికే ప్రయాణమై రెండు రోజులలోనే ఆ నగరం చేరుకొన్నాడు.

మహామాత్యుని విడిది చేరుకోగానే హర్ష విక్రమాదిత్య చక్రవర్తి దూత దర్శనానికై వేచిఉన్నాడనీ, తత్క్షణమే దర్శనం ఇప్పించవలసిందనీ ప్రతీహారుల ద్వారా సందేశం పంపించాడు.

మహామాత్యుడా సందేశం వినీ వినగానే ద్వారందగ్గరకు వచ్చి సగౌరవంగా మాతృగుప్తుని తన రహస్యభవనంలోనికి తోడుకుపోయాడు.

కవికి అక్కడ మహామాత్యుడేకాక కొంతమంది సైన్యాధిపతులు, దండనాయకులు మొదలైన ఉన్నతాధికారులుకూడా కనిపించారు. వారందరి సమక్షంలోను కవి చక్రవర్తి తనకిచ్చిన సువర్ణపేటికను సగౌరవంగా మహామాత్యునికి సమర్పించాడు. అది చక్రవర్తి ముద్రాంకితమైన స్వర్ణపేటిక. చక్రవర్తి తన లేఖ అతి జాగ్రత్తగా దానిలోనే భద్రపరిచాడు.

మొదట మహామాత్యుడా లేఖ చదువుకొన్నాడు. చదువుతూనే నిలువునా నిర్ఘాంతపోయాడు! అలా కొంతసేపుండి తరువాత అది ఇద్దరు ముగ్గురు దండనాయకులకు కూడా చూపించాడు. వారు మొట్టమొదట తమ కన్నులే నమ్మలేకపోయారు! మాతృగుప్తుడక్కడ చక్రవర్తి దూత కుచితమైన ఒక సింహాసనంలో కూలబడిపోయి ఒక వేడినిట్టూర్పు విడిచిపెట్టాడు.

మహామాత్యుడు సవినయంగా అతనిని సమీపించి సగౌరవంగా ఇలా అడిగాడు:

"తమరేనా మాతృగుప్తులు?"

"ఔను!"

"తమరు కవీశ్వరులేకదా!"

మాతృగుప్తుడౌననలేదు గాని 'ఔ'నన్నట్టుగా శిరఃకంపంచేసి చిరునవ్వు నవ్వాడు. వారావిధంగా పరీక్షించడానికి గల కారణమేమో అతనికి బోధపడలేదు. ప్రశ్నార్థకంగా వారివైపు చూశాడు.

మహామాత్యుడు సవినయంగా "ఈ క్షణంనుంచీ తమరే కాశ్మీరాధీశ్వరులు!" అన్నాడు.

మాతృగుప్తుడది విశ్వసించలేదు!

"హర్ష విక్రమాదిత్య చక్రవర్తి తమ స్వహస్త ముద్రాంకితమైన శ్రీముఖంలో తమరిని కాశ్మీర రాజ్యాధీశ్వరులుగా ప్రతిష్ఠించారు!" అన్నాడు కాశ్మీరమంత్రి. వెంటనే కాశ్మీరచక్రవర్తిసన్నిధిని నిలుచున్నట్టుగా మాతృగుప్తుని సన్నిధిని చేతులు జోడించి నిలుచున్నాడు. మిగిలిన దండనాయకులు కూడా లేచి నిలబడి చేతులు జోడించారు. మాతృగుప్తుడా వెనకటి ఆశ్చర్యాఘాతంలోనుంచి ఇంకా బాగా తేరుకోనేలేదు! అంతలోనే ఇంకొక ఆశ్చర్యాఘాతం! మహామాత్యుడు తిరిగి ఇలాఅన్నాడు: "ఈ క్షణంనుంచి కాశ్మీరం సర్వస్వతంత్ర రాజ్యంగానే వ్యవహరించవలెననీ, ఉజ్జయినీసామ్రాజ్య సామంతరాజ్యంగా వ్యవహరింపరాదనీ వారీ శ్రీముఖంలో ఆజ్ఞాపిస్తున్నారు."

మాతృగుప్తుని కింకా అనుమానం తీరలేదు! నెమ్మదిగా చక్రవర్తి లేఖకోసం చేయిచాచాడు. మంత్రి సవినయంగా అది మాతృగుప్తుని కందించాడు.

మాతృగుప్తుడా లేఖలో ప్రతి అక్షరమూ ఎంతో జాగ్రత్తగా పరిశీలించాడు. మహామాత్యుడు చెప్పినదంతా అక్షరాలా యథార్థమే! దానిలో ఎక్కడా ఇక సందేహాని కాస్కారమే లేదు!

ఆటుపిమ్మట మంత్రి మరునాడే శుభముహూర్తం ఏర్పాటు చేయించి శ్రీనగరంలో పట్టాభిషేక మహోత్సవం జరిపించబోతున్నామనీ, ఆనాడే శ్రీనగరానికి తరలిపోతున్నామనీ, దానికి ఆజ్ఞాముద్ర ఇప్పించవలసిందనీ తిరిగి సగౌరవంగా విజ్ఞప్తి చేశాడు.

మాతృగుప్తుని కిక దాని కంగీకారముద్ర వేయక తప్పలేదు. ఆ పట్టాభిషేకం జరపవలసిన దివసంకూడా చక్రవర్తి ఆ లేఖలో ఉట్టంకించి ఉండడంవల్ల అది మార్చడాని కెవరికీ ధైర్యం కలుగలేదు.

మరునాడు కాశ్మీర రాజధాని శ్రీనగరంలో మాతృగుప్తునికి యథావిధిగా సామ్రాజ్య పట్టాభిషేకం జరిగిపోయింది. శ్రీనగరమే కాక కాశ్మీరమండలం అంతా ఆనాడు ఉత్సవ కోలాహలంలో తలమునక లయిపోయింది.

మాతృగుప్తుని కా పట్టాభిషేక సమయములో రెండే రెండు ప్రధాన విషయాలు స్ఫురించాయి. వాటిలో మొదటిది హర్ష విక్రమా

దిత్య చక్రవర్తి తనయెడల కనబరచిన అపారమైన ఔదార్యం! అది తలచుకున్నప్పుడు ఆనందబాష్పాలతో కలిసిన అభిషేకజలాలు అవిరళ ధారలుగా అతని శరీరంమీద ప్రవహించాయి.

రెండవది అతని గృహిణి విషయం. వివాహమైన క్షణంనుంచీ ఆ సహధర్మచారిణి అనేకమైన కష్టసుఖాలలో అతనికి తోడునీడగా, చేదోడు వాదోడుగా నిలబడింది. ఆమె తనతోపాటు కాశ్మీరం వస్తానని ఎన్నెన్నోవిధాల కాళ్ళావేళ్ళాపడి బతిమాలింది. అనారోగ్యం వల్ల ఆమెను తనవెంట తీసుకురాలేదు. ఆమె అనారోగ్యం ఎలా ఉన్నదో తెలియదు. ఏకైక పుత్రుని మరణదుఃఖంతో ఆమె కుమిలి కుమిలి కృశించిపోతున్నది. ఆమె అతని సరసన కూర్చుని చక్రవర్తినీ గౌరవం పొంది ఆనందించవలసిన సమయమది. ఆమె లేకుండానే హఠాత్తుగా అతడి చక్రవర్తి గౌరవం పొందడం జరిగింది. అది తలుచుకోగానే అతని ఆనందబాష్పాలు దుఃఖాశ్రుధారలై ప్రవహించాయి. అయినా అతడా శోకం అంతా లోలోపలనే స్తంభింపజేసుకొన్నాడు.

అటుపిమ్మట విక్రమాదిత్య చక్రవర్తికి కృతజ్ఞతా సూచకంగా అమూల్యమైన కానుక లేవేవో పంపించాలని అనుకొన్నాడు. ఆ కానుకలు సమాన గౌరవ ప్రపత్తితోనే పంపించాలిగాని సామంత ప్రభువుగా పంపరాదు! అది చక్రవర్తి ఆజ్ఞ! ఆ విధంగా సమాన సార్వభౌమ గౌరవంతో చక్రవర్తికి కానుకలు పంపించడానికి అతని హృదయం అంగీకరించలేదు. ఆ విషయం తలుచుకోవడమే అతనికెంతో లజ్జాకరంగా పరిణమించింది. వెంటనే ఒక భూర్జపత్రంపై ఒకే శ్లోకం రచించి అది చక్రవర్తి కాశ్మీర మహామాత్యునికి పంపించిన స్వర్ణపేటికలోనే ఉంచి తక్షణమే అది వేగరుల ద్వారా విక్రమాదిత్య సార్వభౌమునికి పంపించే ఏర్పాటు చేయించాడు.

"చక్రవర్తీ! నీలోని ఆత్మోత్కర్ష సూచనామాత్రంగానైనా స్ఫురించనీయలేదు! నీ మహౌదార్యం ఛాయామాత్రంగానైనా భాసించనీయలేదు! మహాప్రభూ! నీ వితరణ నిశ్శబ్దజలధరవర్షం! నీ అనుగ్రహం ఫలరూపంలోనే ప్రత్యక్షమైనది!" అని ఆ శ్లోక తాత్పర్యం.

అటుపిమ్మట వెంటనే సర్వమంగళకా శుభవార్త తెలియజెయ్యడానికై జవనాశ్వాలపై నలుగురు వేగరులను ఉజ్జయినీనగరానికి పరిగత్తించాడు.

సర్వమంగళ క్షేమాత్రం ఆరోగ్యంగా ఉన్నా వెంటనే ఆమెను కాశ్మీరానికి తోడ్కొని రావలసిందని అజ్ఞాపించాడు. ఒక వేళ శరీరారోగ్యస్థితి దీర్ఘప్రయాణానికి అనుకూలం కాకపోతే ఆమె చికిత్సకై ఉజ్జయినీ నగరంలో రాజవైద్యుల నేర్పరచవలసిందని ఆజ్ఞాపించాడు. అటుపిమ్మట పదిహేను రోజుల వరకు నిద్రాహారాలు లేకుండా ఆ వేగరుల రాకకోసం ఎదురుతెన్నులు చూచాడు. ఆ పదిహేను రోజులూ అతనికి మహాయుగాలుగా గడిచాయి. చివరికి వేగరులు వచ్చారు.

మాతృగుప్తుడు కాశ్మీరానికి బయలుదేరి వెళ్ళిన మరునాటినించి సర్వమంగళ రోగం మళ్ళీ తిరగబెట్టింది. క్రమంగా అది బాగా ముదిరిపోయింది. ఇక ఆమె జీవించదని అందరూ నిశ్చయించారు. ఇంతలో వేగరు లతికష్టంమీద ఆ శుభవార్త ఆమె చెవిలో వేశారు. ఆ మాట వినీ వినగానే ఆమె ముఖంలో ప్రత్యూషపు ఒక్కసారిగా తామరపూవులా వికసించింది! మరుక్షణంలో ఆ ఆనందాఘాతం ఆమె హృదయాని కొక వజ్రాఘాతంలా పరిణమించింది. వెంటనే ఆమె మరణించింది. వేగరులా వృత్తాంతం అంతా చక్రవర్తికి విన్నవించారు.

మాతృగుప్త చక్రవర్తి ఆ మాట వింటూనే మొదలు నరికిన తరువులా అక్కడే కూలబడిపోయాడు!

5

గృహిణీమరణంతో మాతృగుప్తునికి వజ్రాఘాతం తగిలినట్లయింది. ఎంతోకాలం దాకా అతడా ఆఘాతంలోనించి కోలుకోలేదు. అయినా అతడా దుఃఖభారం పైకి ఏ మాత్రం వ్యక్తం కానీయలేదు. పైపైకి చాలా ఉల్లాసంగానే కనబడుతూండేవాడు. కాని లోలోపల ఆ శోకం ఆరని చిచ్చులా రగిలి అతని హృదయాంతరాళ జీవనాళాలను దహించివేసింది.

కాశ్మీర మహామాత్యుల కుటుంబాలకు సంబంధించిన బ్రాహ్మణు లెందరో అతనికి తమ కన్యకల నిచ్చి వివాహం చెయ్యాలని ఉవ్విళ్ళూ రారు. ఆ ప్రస్తావన వచ్చినప్పుడు మాతృగుప్తుడొక్క నిట్టూర్పు విడిచే వాడు. ఆ పైన మహామాత్యులిక అప్రయత్నంవల్ల లాభం లేదని ఆ విషయం విడిచిపెట్టి వేసేవారు.

మాతృగుప్తుని లోలోపల నిరంతరం ప్రవహించే శోకవాహిని అతని హృదయాని కొక అపూర్వమైన ఆర్ద్రత కలిగించింది. అతడు శ్రీనగరంలో ఎన్నెన్నో దేవతాగారాలు నిర్మింపజేశాడు. ప్రత్యేకంగా మాతృగుప్తేశ్వరాలయమనే మహేశ్వరాలయం నిర్మింపజేశాడని కల్హణ మహాకవి రాజతరంగిణిలో పేర్కొన్నాడు.

తమ పూర్వుల సంప్రదాయం ప్రకారం మాతృగుప్తుని కొకమారు యజ్ఞం చెయ్యవలెనని సంకల్పం కలిగింది. యజ్ఞసంభారాలు సేకరించడం పూర్తిఅయిపోయింది. అంతలో ఒకనాడు అతని కొక యజ్ఞపశువు దీనాక్రందనం వినిపించింది. వెంటనే ఆ యజ్ఞం నిలిపివేసి మిగిలిన యజ్ఞపశువుల నన్నిటినీ విడిచి పెట్టించివేశాడు. అంతేకాక కాశ్మీర రాజ్యంలో ఏ విధమైన జంతుహింసా జరగ కూడదని నిషేధించాడు!

ఒకసారి హయగ్రీవవధ మహాకావ్యం రచించిన భర్తృమేంఠకవి అతని సందర్శనార్థమై వచ్చాడు.

అది చైత్రమాసం. సూర్యోదయకాంతులింకా రాజగృహ ద్వారంలో నిలిపిన సువర్ణ మంగళకలశాలపై ప్రతిఫలించలేదు. ఆ సమయంలో కాశ్మీర మహామాత్యునికి కూడా మాతృగుప్తచక్రవర్తి దర్శనం లభించదు. కాని మాతృగుప్తుడు మహాకవి, చక్రవర్తి అనే ఆశతో భర్తృమేంఠకవి ఆ సమయంలోనే అతనిదర్శనానికి వచ్చాడు. అతని ఆశ నిరాశకాలేదు. ద్వారపాలకులు కవి నామధేయం ఉచ్చరించగానే చక్రవర్తి తొందరతొందరగా తన అభ్యంతర మందిరంలో నుంచి సభాభవనంలోనికి వచ్చివేశాడు. భర్తృమేంఠకవి ఈ అపూర్వ గౌరవాని కెంతో సంతోషించాడు.

కవి తన హయగ్రీవవధ మహాకావ్యం పఠించడం ప్రారంభించాడు.

చక్రవర్తి అలాగే శ్రద్ధగా ఆ కావ్యం ఆలకించాడు. ఆ కావ్య పఠనం అలా పదిరోజులదాకా కొనసాగింది. మాతృగుప్తచక్రవర్తి ఆ కావ్యపఠనం జరుగుచున్నంతసేపూ ఒక్కనాడు ఒక్క చిన్న చిరునవ్వైనా చిందించలేదు. అదంతా అలాగే తటస్థదృష్టితో విని ఊరుకున్నాడు. దానితో కవి హృదయంలో వెలిగే ఆశాదీపం కాస్తా కొండెక్కిపోయింది. ఎలాగో అలాగ కావ్యపఠనం పూర్తిఅయింది. కవి తన భూర్జపత్రగ్రంథం విసుగుగా నేలమీద పడవేశాడు. చక్రవర్తి అది చూచి వెంటనే ఆ సమీపంలో ఉన్న బంగారుపళ్ళెరం తీసుకువచ్చి అది అతిభద్రంగా ఆ పళ్ళెరంలో ఉంచాడు. దానితో భర్తృమేంఠ కవికి చక్రవర్తి కా కావ్యంమీద కలిగిన మహాగౌరవం స్ఫురించింది. అతని ముఖం సువర్ణదర్పణంలాగా వికసించింది. తరువాత చక్రవర్తి అతనిని అపార ధనరాసులతో సత్కరించాడని వేరే వ్రాయనక్కరలేదుగదా!

ఆ విధంగా కాశ్మీరంలో మాతృగుప్త చక్రవర్తి పరిపాలన మూడు నెలలు తక్కవగా అయిదుసంవత్సరాల ఒకరోజువరకు నిరంతరాయంగా కొనసాగిందని కల్హణుని రాజతరంగిణి పేర్కొంటున్నది.

అయితే ఆ అవధికి చాలా కాలానికి పూర్వమే ప్రవరసేనుడు తిరిగి కాశ్మీరానికి వచ్చివేశాడు. జీవితంపై తీవ్రవిరక్తితో అతడెన్నెన్నో పుణ్యక్షేత్రాలు సందర్శించాడు. ఆ విరక్తిలో అతనికి కాశ్మీరానికి తిరిగి రావాలనే అనిపించలేదు. తరవాత కర్ణాకర్ణిగా మాతృగుప్తుని పట్టాభిషేకవార్త తెలిసింది. దానితో అతని హృదయంలోని రక్తం అంతా ఒక్కసారిగా రెండు కళ్ళలోకీ ప్రవహించింది! పాలవంటి క్షత్రియవంశంలో అవతరించిన క్షత్రియచక్రవర్తులు పరిపాలించే కాశ్మీర రాజ్యంలో ఒక బ్రాహ్మణ కవి పట్టాభిషిక్తుడైనాడు! కాశ్మీర రాజ్యానికీ, కాశ్మీర రాజవంశీయులకూ అది ఎంతటి తలవంపు! అనుకొన్నాడు ప్రవరసేనుడు! వెంటనే విక్రమాదిత్యుని నిర్మూలించివేసి తదనంతరం కాశ్మీరరాజ్యం తిరిగి చేపట్టాలని అతడొక దృఢప్రతిజ్ఞ పట్టాడు. మరుక్షణంలోనే తల్లితో కలిసి కాశ్మీరరాజ్యానికి వచ్చివేశాడు. కాని తనరాక ఎవరికీ తెలియనీయకుండా అతి రహస్యంగా దాచివేశాడు.

అనతికాలంలోనే నిగూఢంగా శ్రీనగరంలో ప్రవేశించాడు. ఇద్దరు ముగ్గురు వృద్ధ కాశ్మీర మంత్రులను రహస్యంగా కలుసుకొని చూచాయగా వారికి తన సంకల్పం తెలియజేశాడు. వారు శాయశక్తులా అతని ప్రతిజ్ఞా నిర్వహణకు సాయపడగలమని వాగ్దానం చేశారు.

"మాతృగుప్తుడు సమర్థుడేనా?" అన్నాడు ప్రవరసేనుడు.

"మేము మొట్టమొదట ఇలాగే శంకించాము. పోనుపోను వారి దక్షత విక్రమాదిత్య చక్రవర్తి శక్తిసామర్థ్యాలనుగూడా మించిపోయిన దేమో అనిపించింది" అన్నాడు మంత్రి.

"ఓహో! అలాగా!"

"వారు కవిమాత్రులని అనుకోవడం కేవలం పొరబాటే!" అన్నా డింకొక మంత్రి.

"ఈ బ్రాహ్మణ కవీశ్వరుని కింతటి శక్తిసామర్థ్యా లెలా కలిగాయో!" అని ఆశ్చర్యపోయాడు ప్రవరసేనుడు.

"ఏదైనా ఉజ్జయినీ మహామాత్యుల వంశంలో ఉద్భవించా రేమో!" అన్నాడు మరిఒక మంత్రి.

అటుపిమ్మట మంత్రులందరూ మాతృగుప్త చక్రవర్తిని పదభ్రష్టుణ్ణి చెయ్యడ మెలాగా అని ఆలోచించడం ప్రారంభించారు. ప్రవరసేనుడు తమ ప్రథమకర్తవ్యం అది కాదన్నాడు.

"మనం ముందుగా నిర్మూలించవలసింది విక్రమాదిత్య చక్రవర్తిని!"

"ముందుగా వంటఇంటి కుందేటి పనిపట్టడమే సుకరం!" అన్నాడు తిరిగి ఇంకొక మంత్రి.

"కాని మాతృగుప్తునికి విక్రమాదిత్యు డడ్డుపడితే— ?"

"ఆ విషయం అప్పుడే ఆలోచించుకోవచ్చును!" అన్నాడు మరి ఒక మంత్రి.

కాని ప్రవరసేనుడు దాని కంగీకరించలేదు. విక్రమాదిత్యుని నిర్మూలనానంతరమే మాతృగుప్తునిపై విప్లవం లేవదీయడం సుకరమనీ, అదే సరియైన మార్గమనీ నిశ్చయించాడు. మంత్రుల కా నిశ్చయమే

సరియైనదని అంగీకరించక తప్పలేదు. వెనువెంటనే మంత్రులతోడ్పాటుతో విక్రమాదిత్యునిపై దండెత్తి పోవడానికి తగిన సైన్యాలు రహస్యంగా సిద్ధపరచడానికి తగిన ఏర్పాటులన్నీ జరిగిపోయాయి. ఆ ఏర్పాటులన్నీ మొట్టమొదట మాతృగుప్తుని గూఢచారులకు గూడా తెలియనంతటి నిగూఢంగా జరిగిపోయాయి.

6

మాతృగుప్తునికి భార్యా వియోగం వల్ల జీవితం ఎంత దుర్భరమైనా, కాశ్మీరరాజ్యకార్యనిర్వహణలో అతడొక క్షణమైనా ఏమరలేదు. ఆవిధంగా నిరంతరం రాజ్యకార్యాలలో మునుగుతూ తేలుతూ ఉండడంవల్లనే అతనికి మనశ్శాంతి బాగా లభించింది. కాని ఏమాత్రం తీరిక దొరికినా ఆవేళలో అతనికి సర్వమంగళ స్ఫురణకు వచ్చేది. వెంటనే అతనికి సార్వభౌమాధికారము, భోగ భాగ్యాలు మొదలైనవన్నీ కేవలం నిస్సారంగా స్ఫురించేవి.

అలా కొంతకాలం గడిచింది. ఒకనాడు మాతృగుప్తుడు తన ప్రాసాదంమీదనించి పరిసరోద్యానవన సౌందర్యం తిలకిస్తున్నాడు. అప్పుడే సూర్యాస్తమయం అయింది. ఆకాశంలో సన్నని చంద్రవంక మెరిసింది. దూరదూరంగా గోచరించే మహాసరోవరంలో అక్కడక్కడ కొన్ని హంసమిథునాలు కదలాడుతున్నాయి. ఆ నిర్మల సరోవరంలో వాటితోబాటు వాటి ప్రతిబింబాలుకూడా ప్రశాంతంగా సాగిపోతున్నాయి. అప్పుడే ఉదయిస్తున్న తారకలా గభీరజలాల్లో వెండిమీనులవలె తళతళ మెరిసిపోతున్నాయి. అంతలో విశాల సరోవరం అవతలివైపునుండి ఒక చిన్ననౌక హంసలా నెమ్మదిగా తేలివచ్చింది. దానిలో యువతీయువకు లిద్దరు విహరిస్తున్నారు. ఆ యువతిచేతిలో ఒక పసికందు! నౌక అలికిడికి బెదరిపోయిన రంగురంగుల మీనులు పైకెగురుతూ తిరిగి నీటిలో మునిగాయి. వెంటనే ఆ సరోవరంలో చిన్నిచిన్ని వర్తులరేఖ లేర్పడ్డాయి. అవి నీటిలో ప్రతిఫలించిన చంద్రవంక కాంతులలో ముత్యాలహారాలలా తళతళ మెరిసిపోయాయి. మాతృగుప్త చక్రవర్తి నేత్రాలా సౌందర్య డోలికలలో ఉయ్యాల లూగాయి.

తరవాత అలా రెండు మూడు నిమిషాలు గడిచిపోయాయి. మాతృగుప్తుని సింహాసనానికి వెనకగా మనోజ్ఞమైన అందెలరవళి వినిపించింది! అత డాశ్చర్యపడి వెనక్కి తిరిగి చూచాడు. ఎదురుగా ఏడువారాల నగలు ధరించిన సర్వమంగళ! ఆమె చేతిలో అయిదేళ్ళ కుమారుడు! ఆమె ఆ పసివాణ్ణి మాతృగుప్తుని కందించింది. అత డెంతో ఆప్యాయంగా ఆ పసివాణ్ని ఎత్తుకున్నాడు. అంతలో అతని కేదో అనుమానం తోచింది. "నీకు బాగా నెమ్మదిగా ఉన్నదా? ఇంత దూరం ఒంటరిగా ఎలా ప్రయాణం చేయగలిగావు సర్వమంగళా?" అన్నాడు. ఆమె ఆమాట కేమీ సమాధానం చెప్పలేదు. అలాగే చిరునవ్వు నవ్వుతూ తిరిగి ఆ పసివాణ్ణి తీసుకొని అక్కడే అదృశ్యమైపోయింది! ఆ క్షణంలోనే మాతృగుప్తునికది యథార్థం కాదనీ, స్వప్నమే అనీ స్ఫురించింది. ఆపైన ఏమిజరిగిందో అతనికి స్పృహ లేదు.

లేచి నాలుగువైపులా పరిశీలించేసరికి చుట్టూరా పరిచారకులు కనిపించారు. వా రనేక విధాలుగా పరిచర్యలు చేసినమీదట అతి కష్టంమీద అతనికి తిరిగి స్మృతి కలిగింది.

చక్రవర్తికి ఎదురుగా మహామాత్యుడు కనిపించాడు. వెంటనే—"విక్రమాదిత్య చక్రవర్తి దేహస్థితి ఎలా ఉన్నది?" అని ప్రశ్నించాడు.

మహామాత్యు డా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. కొంచెంసేపూరుకొని చేతులు జోడించి "మహాప్రభూ! నా దొక్క చిన్న మనవి. సావధానంగా చిత్తగించాలి." అన్నాడు.

"నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పరేల?" అన్నాడు మాతృగుప్తుడు కొంచెం అధికారస్వరంతో.

"మహాప్రభూ! విక్రమాదిత్య చక్రవర్తికి బాగా అస్వస్థతగా ఉన్నదని మనకు తెలిసి పక్షం రోజులే అయింది. అప్పటినుంచి యామయామానికీ వేగరులు ఉజ్జయినికి పరుగులు పెడుతూనే ఉన్నారు. ఈ గడియకు చేరుకోవలసిన వేగరు లింకా తిరిగిరాలేదు. మరి తమకు నే నేమని మనవి చెయ్యగలను!" అన్నాడు.

తరవాత అమాత్యుడు ఒక నిమిషం వరకూ ఏమీ మాట్లాడలేదు. తిరిగి చక్రవర్తి ముఖభంగిమ పరిశీలిస్తూ — "నాదొక్క మనవి!" అన్నాడు.

చక్రవర్తి ప్రశ్నార్థకంగా బొమముడి విరిచాడు.

అమాత్యుడు కొంత సంకోచిస్తూ "తమరు తిరిగి వివాహం చేసుకొని తమవంశం నిలబెట్టవలెనని నా ప్రార్థన" అన్నాడు.

మాతృగుప్తుడు కొంచెం సేపటివరకు మాటలాడ కూరుకుని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు.

"ఈ విషయం మీ రొకటిరెండుమారులు నాకు విన్నవించి ఉన్నారు ... కాని నేనొక దురదృష్టవంతుణ్ని! ఈ దురదృష్టం ఇంకొకరికికూడా సంక్రమింప జెయ్యనేల ?" అన్నాడు.

వెంటనే మాతృగుప్త చక్రవర్తి ముఖం ఉద్యానవనంవైపు తిప్పివేశాడు. అమాత్యుని కతని కనుగొలకులలో రెండు చిన్న కన్నీటి బిందువులు స్ఫురించాయి. చక్రవర్తి రాజ్యాధికారం స్వీకరించి అప్పుడే కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. కాని మంత్రికి చక్రవర్తి ముఖంలో ప్రప్రథమంగా నేడే బాష్పబిందువులు స్ఫురించాయి! ఆపైన అత డా విషయం మరి ప్రస్తావించడానికి సాహసించలేదు!

అలా ఒక నిమిషం గడిచిపోయింది. ఇంతలో ప్రతీహారి ప్రవేశించి — "ఉజ్జయినీ నగరంనించి వచ్చిన వేగరులు తమ దర్శనం కోరుతున్నారు" అన్నాడు అమాత్యునితో. అతడది వింటూనే వేగరుల వార్తలు తెలుసుకోవడానికి తొందర తొందరగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

మాతృగుప్త చక్రవర్తి కతడు తిరిగి వచ్చేవరకూ క్షణ మొక యుగంలా గడిచింది. అంతలో మంత్రి తిరిగి వచ్చాడు. అతడు మొదట చిరునవ్వు నవ్వాడు. తరవాత ప్రసంగంలో కొంత పూర్వరంగం కల్పించి క్రమ క్రమంగా, నెమ్మది నెమ్మదిగా మాతృగుప్తునికి హర్ష విక్రమాదిత్యుని హఠాన్మరణ వార్త తెలియజేశాడు. మాతృగుప్త డా మాట విని నిలుచున్న పాటుగానే శిలాప్రతిమలా స్తంభించి పోయాడు.

7

విక్రమాదిత్యుని మృతితో తలవని తలంపుగా తన ప్రతిజ్ఞ నెరవేరిపోయిందని ప్రవరసేనుడు చాలా సంతోషించాడు. తన సైన్యం అంతా ఇక శ్రీనగరంలో విప్లవం లేవదీయడానికి వినియోగించవచ్చుననీ, తద్వారా మాతృగుప్తుని తేలికగా తొలగించ వచ్చుననీ ఆశించాడు. కాని ఇటీవల మాతృగుప్తుడు కూడా సైన్యం సమాయత్తపరిచాడనీ, శత్రువిచ్ఛేదానికి సకల ప్రయత్నాలూ చేస్తున్నాడనీ తెలిసింది. ప్రవరసేనుడు లోలోపల మాతృగుప్తుని జాగరూకత కెంతో మెచ్చుకొన్నాడు. కాని తన ప్రయత్నాల కొక పెద్దవిఘాతం ఏర్పడినదే అని ఎంతైనా మథనపడ్డాడు.

ఆ తరువాత కొన్ని దినాలకు మాతృగుప్త చక్రవర్తి హఠాత్తుగా రాజ్యపరిత్యాగం చేశాడనీ, తాత్కాలికంగా కాశ్మీర రాజ్యపరిపాలన వ్యవహారం అంతా మహామాత్యునికే అప్పజెప్పాడనీ తెలిసింది. మొట్టమొదట ప్రవరసేను డది విశ్వసించలేదు. పిమ్మట వేగులవారిద్వారా ఆ వార్త నిశ్చయమేనని స్పష్టపడిపోయింది. మాతృగుప్తుడావిధంగా కాశ్మీర రాజ్యసంరక్షణకై బలాలన్నీ సమాయత్తపరిచినా, హఠాత్తుగా రాజ్యపరిత్యాగం చెయ్యడానికిగల కారణమేమో ప్రవరసేనునికి బోధపడలేదు. ఇక కాశ్మీరరాజ్యం కూడా తేలికగా తన హస్తగతమైపోగలదనీ, తన ప్రతిజ్ఞ నెరవేరిపోయినదనీ ఎంతైనా సంతోషించాడు. కాని మాతృగుప్త చక్రవర్తి హఠాత్తుగా రాజ్య పరిత్యాగం చెయ్యడానికి కారణం? అది తెలుసుకోవడం తన ప్రయత్నాల కత్యంతావశ్యకమని ప్రవరసేనుడు నిశ్చయించాడు. వెంటనే మాతృగుప్తుని సందర్శించ వలెనని అనుకొన్నాడు. కాని రాజ్య వ్యవహారాలనుగురించి ప్రసంగించదలుచుకొన్నవారి కెవరికీ మాతృగుప్త చక్రవర్తి దర్శనం లభించడంలేదు! రాజ్యపరిత్యాగం చేసినప్పటినించీ మాతృగుప్తుడు కేవలం కవిపండిత గోష్ఠితోనే కాలక్షేపం చేస్తున్నాడు. రాజ్యవ్యవహారాలు సంప్రదించదలుచుకొన్నవారి నందరినీ వెంటనే మహామాత్యుని సన్నిధికి పంపించివేస్తున్నాడు. అందువల్ల పండితవేషంతోనే మాతృగుప్తుని సందర్శించవలెనని ప్రవరసేనుడు నిశ్చయించాడు.

అటుపిమ్మట విద్వాంసుని వేషం వేసుకొని మాతృగుప్తుని సందర్శనం కోసం బయలుదేరాడు.

అప్పటికి చైత్రం కొంతవరకు గడిచింది. మాతృగుప్తుడు రాజభవన పరిసరోద్యానవన సౌందర్యం తిలకిస్తున్నాడు. రాజప్రాసాదానికి నాలుగువైపులా అల్లిబిల్లిగా అల్లుకొన్న ద్రాక్ష పందిరులపై ప్రాతఃకాల సూర్యకిరణా లప్పుడప్పుడే ప్రసరిస్తున్నాయి. ఆ కాంతులలో ద్రాక్షాఫలగుళుచ్ఛాలు సువర్ణచ్ఛాయలతో మెరుస్తున్నాయి. రంగురంగుల చిలక లా ఉద్యానవనంలో బారులుదీరి విహరిస్తూ చిత్రవిచిత్రమైన వసంతోత్సవతోరణాలలా కదలాడుతున్నాయి.

ప్రవరసేనుడు ద్వారంలో నిలబడి మాతృగుప్తుని ముఖవైఖరి పరిశీలించాడు. అతని విశాలనేత్రాలు ప్రాతఃకాల సౌందర్య శోభల్లో మునకలు వేస్తున్నట్టున్నాయి. ఒక్క నిమిషం అలాగే నిలబడి ప్రవరసేనుడు మాతృగుప్తునికి నమస్కరించి ఎదురుగా ఒక సుఖాసనంలో కూర్చున్నాడు. కొంత ప్రసంగం గడిచినతరువాత మాతృగుప్తునికి తన నిజనామధేయము, తన జిజ్ఞాస తెలియజేశాడు. మాతృగుప్తుడు దానికాశ్చర్యపడలేదు. ప్రవరసేనుని రాకవిషయం అత డంతకుపూర్వమే అవగాహన చేసుకున్నాడు. కొంతవరకు మౌనభావం వహించి నెమ్మదిగా ఇలా అన్నాడు:

"మీ రెప్పుడైనా సూర్యకాంత మాణిక్యం పరిశీలనగా చూశారా ?"

"చూడకేమి? అయినా ఎందు కలా ప్రశ్నిస్తున్నారు?"

"ఆదిత్యుని అ స్తమయంతో సూర్యకాంతమణి దీప్తి తగ్గిపోతుంది. విక్రమాదిత్య చక్రవర్తి అస్తమించినపిమ్మట మరి నాదీప్తీ అంతే!"

అంతటి ప్రభుభక్తి విశ్వాసాలతో అన్న ఆ వాక్యం మొట్టమొదట ప్రవరసేనుని కెంతో ఆశ్చర్యం కలిగించింది. అయినా అది అత డంతగా విశ్వసించలేదు. నెమ్మదిగా ఇలా అడిగాడు:

"మా సైన్యసన్నాహం చూచి తమ రీవిధంగా రాజ్యత్యాగం చేశారేమో అని లోకం భావిస్తున్నది. నిజమేనా?"

"లోక ప్రవాదానికి నేనాశ్చర్యపడడం లేదు. ఆ ప్రవాదం మీ వంటివారు విశ్వసించినందుకే నే నాశ్చర్యపడుతున్నాను. అయినా మించిపోయినదేమీలేదు! రణరంగంలో ఒకసారి బలాబలాలు పరీక్షించుకొందాము. సరేనా?" అని మాతృగుప్తుడతనివైపు చూచాడు.

ప్రవరసేనునికి తన తప్పిదం తెలిసిపోయింది. మాతృగుప్తుని ఔదార్యంతోబాటు నేడతని ధైర్యసాహసాలు కూడా చవిచూచాడు.

ఒక నిమిషంవరకూ ఆత్యాశ్చర్యదృష్టితో అతని ముఖం పరిశీలించాడు. మాతృగుప్తుడు ఒక్క చిన్న నవ్వు నవ్వి ఇలా అన్నాడు:

"విక్రమాదిత్య చక్రవర్తి కేవలం కవితా గౌరవంతో నాకీ సామ్రాజ్యప్రదానం చేశారని మీరు భ్రమిస్తున్నారు! ఒక్క సంవత్సరం పాటు అహోరాత్రాలూ నా దక్షత పరీక్ష చేసినమీదటే నాకీ సామ్రాజ్య ప్రదానం జరిగింది."

ప్రవరసేనుని కా విషయం మరింత ఆశ్చర్యం కలిగించింది. అతని హృదయంలో మాతృగుప్తునిమీదా, అతని అర్హతమీదా కలిగిన అపోహ లన్నీ ఒక్కసారిగా పటాపంచలై పోయాయి. క్రమక్రమంగా ఇంతటి మహితాత్ముడే ఇంకా కాశ్మీరం పరిపాలించడం సముచితమనే గౌరవ భావం కూడా కలిగింది.

"తెలియక నేనేమో ప్రసంగించాను! నన్ను మన్నించండి!" అన్నాడు. దానిమీద మాతృగుప్తుడు—"రాజ్యత్యాగం చేసినా నా ఔద్ధత్యం ఇంకా నన్ను విడిచిపెట్టలేదు! ఇందువల్ల మొట్టమొదటగా మీరు మన్నించవలసినది నా ఔద్ధత్యమే!" అన్నాడు.

ఆ వినయప్రసంగంతో ప్రవరసేనుని కంఠం స్తంభించిపోయింది. ఒక దేవతామూర్తిని చూచినట్లు మాతృగుప్తునికేసి చూచి సవినయంగా ఇలా అన్నాడు:

"విక్రమాదిత్యులు మీకీ రాజ్యప్రదానం చేసిన హేతువేమో ఇప్పుడిప్పుడే నాకవగతమయింది. వారు చేసినట్టుగానే నేనుకూడా ఈ కాశ్మీరరాజ్యం తిరిగి మీ కర్పిస్తున్నాను. దయఉంచి నా ప్రార్థన మన్నించవలసినదని కోరుతున్నాను!" అన్నాడు.

"మీరు కొంచెం పొరబడుతున్నారు. ఒక చక్రవర్తి ఇతరుల దగ్గర దానం స్వీకరించగలడా? ఇది తెలిసిఉండీ మీ రిలా ప్రార్థించడం భావ్యమేనా?" అని ఒక చిరునవ్వు నవ్వాడు మాతృగుప్తుడు. ఆటుపిమ్మట ప్రవరసేనునికి మాతృగుప్తుని యెడల పూజ్యభావం ఇనుమడించింది. ఎలాగైనా తన ప్రార్థన మన్నించవలసినదని అనేక విధాలుగా ప్రాధేయపడ్డాడు. దానికి మాతృగుప్తుడొక్క నిట్టూర్పు విడిచి నెమ్మదిగా ఇలా అన్నాడు:

"ప్రవరసేనా! నా జీవిత సహధర్మచారిణి సర్వమంగళ, ఏకైక వంశాంకురము దివంగతులైనారు. కవితా ప్రియులైన విక్రమాదిత్య చక్రవర్తులు స్వర్గానికి విజయంచేశారు. బాల్యంనుంచీ కవిచక్రవర్తిని కావలెనని ఆకాశహర్మ్యాలు నిర్మించుకొన్నాను! అవన్నీ నేలపాలై పోయాయి. మరి నేను దేనిని చూచుకొని ఈ సామ్రాజ్యభారం వహించను!"

"మీరు కాశ్మీరప్రజ విషయమే విస్మరిస్తున్నారు!"

"లేదు! ఇకనించి సర్వసమర్థులైన మీరే ప్రజాపరిపాలకులు!" అన్నాడు మాతృగుప్తుడు.

"అది ఎన్నటికీ జరగనేరదు. తాము జీవించి ఉన్నంతకాలము తమరే కాశ్మీరాధీశ్వరులు! మేమంతా మీ భృత్యులమే!"

అని చెప్పి ప్రవరసేనుడు నెమ్మదిగా అక్కడినించి వెళ్ళిపోయాడు.

చక్రవర్తి ప్రవరసేనునిలో హఠాత్తుగా కలిగిన అద్భుత పరిణామాని కెంతో ఆశ్చర్య పడ్డాడు.

ఆటుపిమ్మట నాలుగైదు రోజులకు మాతృగుప్తుడు సన్న్యసించాడనీ, వెంటనే వారణాసీ నగరానికి వెళ్ళిపోయాడనీ ప్రవరసేనుని కొక వార్త తెలిసింది. అనంతరం మాతృగుప్తుని ఆజ్ఞాప్రకారంగా కాశ్మీర మహామాత్యుడు రాజ్యాధికారం స్వీకరించవలసినదని ప్రవరసేనుని ప్రార్థించాడు. ఆ పరిస్థితులలో ప్రవరసేనుని కది స్వీకరించక తప్పలేదు.

మాతృగుప్తుడటుపిమ్మట పది సంవత్సరాలు జీవించాడు. అంతవరకూ ప్రవరసేనుడు మాతృగుప్తుని ప్రతినిధిగానే కాశ్మీరరాజ్యం పరిపాలించాడు. కాశ్మీరరాజ్యాదాయం అంతా మాతృగుప్తునికే పంపించేవాడు. మాతృగుప్తుడా ఆదాయంఅంతా తిరిగి కాశ్మీరానికే పంపించి, దానిలో స్వల్పాదాయం మాత్రమే స్వీకరించి, అది విద్వాంసులకు, కవీశ్వరులకు, యతీశ్వరులకు, యాచకులకు, దీనులకు దానం చేసేవాడట!

పామరులు విశ్వసింపలేరనే భయంతో విశ్వసనీయమైన యథార్థ విషయాలే వ్రాస్తున్నానని కల్హణుడు రాజతరంగిణి పీఠికలో పేర్కొన్నాడు! ఆ కల్హణుడే విక్రమాదిత్య మాతృగుప్త ప్రవరసేనుల చరిత్రలు మూడూ మూడు పునీతమార్గాలలో ప్రవహించిన ఆకాశగంగానదీ ప్రవాహాలవంటివని ముక్తకంఠంతో ప్రశంసించాడు!